క్లుప్తంగా

నేడు కొటార్వేడులో గడప గడపకు..

కార్వేటినగరం: మండలంలోని కొటార్వేడు సచివాలయ పరిధిలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం కొనసాగుతుందని మండల కన్వీనర్ శేఖర్‌రాజు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొటార్వేడు సచివాలయ పరిధిలో ఉన్న కేఎం పురం, ఏఎండబ్ల్యూ నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి ప్రారంభిస్తారని చెప్పారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొనాలని కోరారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

విజయపురం (నగరి) : మండల ప్రభుత్వ ఐటీఐ (పన్నూర్ సబ్‌స్టేషన్ దగ్గర) కోర్సుల్లో అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ గణేష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐటీఐలో చేరేందుకు పదోతరగతి పాస్, ఇంటర్ పాస్ లేదా ఫెయిల్ అయిన వారు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 27లోపు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పంపాలని, 30న కౌన్సిలింగ్ ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు కళాశాల సిబ్బంది 8639790174, 6303156450, 9494434236, 9177035120, 9441449765, 6302478708 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

వెదురుకుప్పంలో వర్షం

వెదురుకుప్పం: మండలంలో మంగళవారం సాయంత్రం మోస్తరు వర్షం పడింది. వెదురుకుప్పం, పచ్చికాపల్లం, మాంబేడు ప్రాంతాల్లో సుమారు గంటపాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడడంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో ప్రజలు ఉక్కపోతతో ఇబ్బంది పడ్డారు. వర్షం పడడంతో కాస్త ఉపశమనం లభించింది.

నాడు-నేడు పనుల పరిశీలన

పాలసముద్రం : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నాడు-నేడు పథకం పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్‌కుమార్ తెలిపారు. మంగళవారం తిరుమలరాజుపురం హైస్కూల్‌లో జరుగుతున్న నాడు-నేడు పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమలరాజుపురం హైస్కూల్‌లో నాడు-నేడు పనులు సక్రమంగా జరగడం లేదని, ఇదే విషయంపై జిల్లా కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు వెళ్లిందన్నారు. అయినా కూడా పనులు నత్తనడకగా సాగుతున్నాయని, వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని హెచ్‌ఎం, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ను ఆదేశించారు. త్వరగా పాఠశాలలో మరుగుదొడ్లు, ప్రహరీ గోడ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ జీవిత మండల విస్తరణాధికారి రమేష్, సీఆర్పీ మహాలక్ష్మి పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ


క్రీడా దుస్తులను అందిస్తున్న శ్యామల

శ్రీరంగరాజపురం : మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు స్పందన సంస్థ నిర్వాహకులు క్రీడా దుస్తులు, క్రీడా సామగ్రిని మంగళవారం ఉపాధ్యాయులకు అందించారు. ఈ సందర్భంగా స్పందన సంస్థ కో ఆర్డినేటర్ శ్యామల మాట్లాడుతూ గత రెండు దశాబ్దాల నుంచి జిల్లాలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో పేద విద్యార్థులకు విద్యాసామగ్రితో పాటు రెండు జతల యూనిఫాం అందిస్తున్నట్లు తెలిపారు. సంస్థ వ్యవస్థాపకులు లంకపల్లి గిరిప్రసాద్(కాలిఫోర్నియా) ఆధ్వర్యంలో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు వారి ఉన్నతవిద్య కోసం ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు చెప్పారు. హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలాక్షమ్మ ఆలయంలో దళితుల పూజలు


దళిత మహిళలచే పూజలు చేయిస్తున్న తహసీల్దార్ పరమేశ్వరస్వామి

పుత్తూరు రూరల్: పోలాక్షమ్మ ఆలయంలో వివక్ష అంటూ ఆందోళన చేస్తున్న దళితులను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక తహసీల్దార్ పరమేశ్వరస్వామి మంగళవారం సాయంత్రం ఆలయ ప్రవేశం చేయించారు. ఈ సందర్భంగా వారితో ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. పుత్తూరు మండల పరిధిలోని రామకృష్ణాపురం (గొల్లపల్లి) గ్రామంలోని పోలాక్షమ్మ ఆలయంలో జరుగుతున్న ఉత్సవాల సందర్భంగా తమ పట్ల వివక్ష చూపారంటూ స్థానిక దళితవాడకు చెందిన కొందరు ఆందోళన చేసిన విషయం విదితమే. ఇదే విషయమై దళిత నాయకుడు గజపతి ఆధ్వర్యంలోని దళితులు మంగళవారం కలెక్టర్ వెంకటరమణారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై తక్షణం స్పందించిన కలెక్టర్ అందరినీ ఆలయంలోకి అనుమతించాలని పుత్తూరు తహసీల్దార్‌ను ఆదేశించారు. దీంతో అందరూ ఆలయంలో పూజలు చేశారు.

పల్లెవిస్తున్న ప్రగతి

- గ్రామాల్లోనే పూర్తిస్థాయి ప్రభుత్వ సేవలు
- మారుమూల గ్రామాలకు సైతం రోడ్డు సౌకర్యం
- మౌలిక సదుపాయాల కల్పనలో పెద్దపీట
- వైఎస్సార్‌సీపీ పాలనలో సాక్షాత్కరిస్తున్న మహాత్ముడి గ్రామ స్వరాజ్యం


మిట్టపాళెంలో ఒకే ప్రాంగణంలో నిర్మించిన సచివాలయం, ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్, కమ్యూనిటీ టాయ్‌లెట్

నగరి : పల్లెలను ప్రగతిబాట పట్టించి, అక్కడి ప్రజల మెరుగైన జీవన విధానానికి అవసరమైన మౌలిక వసతులు కల్పించాలన్నదే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యం. ఆ దిశగా సర్కారు ముందుగు వేసింది. గ్రామాల్లోని ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం రూ.కోట్ల నిధులు మంజూరు చేసింది. ఫలితంగా గ్రామాలు అభివృద్ధి పథంలో ముందుకు దూసుకుపోతున్నాయి. రక్షిత మంచినీటి పైపులైన్లు, అధునాతన వసతులతో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్, పాఠశాల భవనాలు దర్శనమిస్తున్నాయి. దీంతో గ్రామంలో ప్రగతి మల్లెలు విరబూస్తున్నాయి. గత టీడీపీ ప్రభుత్వ పాలలో ఒక సంక్షేమ పథకం మంజూరు కావాలంటే ఆ మండలకేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లి అధికారులు, జన్మభూమి కమిటీలు, టీడీపీ నాయకుల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సి వచ్చేది. పైగా పని కోసం వెళ్లిన వారికీ రాజకీయ రంగు అంటించేవారు. ప్రతిపక్షపార్టీలకు చెందిన వారంటే అసలు స్పందించేవారు కాదు. అయితే నాలుగున్నరేళ్ల కిందట రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కాగానే ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక పల్లె ప్రగతిబాటలో నడుస్తోంది. మహాత్ముడు కలలుగన్న గ్రామస్వరాజ్యం సాకారమవుతోంది.

ప్రజల చెంతనే ప్రభుత్వ సేవలు..

ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు అందాలన్న ఉద్దేశంతో రాష్ట్రప్రభుత్వం లోకల్ గవర్నెన్స్‌కి శ్రీకారం చుట్టింది. గ్రామ, పట్టణ ప్రాంతాల్లో జనాభా ఆధారంగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసింది. తద్వారా ప్రజలకు అవసరమయ్యే ప్రతి ప్రభుత్వ సేవ కూడా స్థానికంగా అందేలా చేశారు. దీంతో మహాత్ముడు కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాకారమవుతోంది. ఒక్కో సచివాలయానికి రూ.40 లక్షలు, వెల్‌నెస్ సెంటర్లకు రూ.20.8 లక్షలు, రైతు భరోసా కేంద్రాలకు రూ.23 లక్షలు అంటూ ఒక్కో సచివాలయ పరిధిలో సుమారు రూ.కోటి మంజూరు చేసి నూతన భవనాలను నిర్మిస్తోంది. ఇలా నియోజకవర్గంలో పలు నూతన భవనాలు మంజూరు కాగా, 40 శాతం భవనాలు నిర్మాణం పూర్తి చేసుకుని వినియోగంలోకి రాగా 30 శాతం భవనాలు వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్నాయి. ఇదిగాక కమ్యూనిటీ టాయిలెట్లు నిర్మించారు. పల్లెల్లోని ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ స్థాయికి మారిపోయాయి.

వలంటీర్ వ్యవస్థతో సరికొత్త చరిత..

ప్రభుత్వం అమలు చేసే ప్రతి సంక్షేమ పథకం కూడా నేరుగా ప్రజలకే అందాలన్న ఉద్దేశంతో రాష్ట్రప్రభుత్వం వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టింది. తద్వారా దేశ చరిత్రలోనే సరికొత్త చరితకు శ్రీకారం చుట్టినట్లు అయింది. సంక్షేమ పథకాలు నేరుగా ప్రజలకు అందించి లబ్ధి చేకూరుతోంది. ఇలా పల్లెలు ప్రగతి బాటపట్టాయి.

ప్రతి సచివాలయానికి ప్రత్యేక నిధులు..

గ్రామ, పట్టణ ప్రాంతాల్లో దీర్ఘకాలికంగా పరిష్కారానికి నోచుకోని సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ప్రతి సచివాలయానికి గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రూ.20 లక్షలు నిధులు కేటాయించింది. అంతేగాకుండా ఆ నిధులు మంజూరు కావడంతో మారుమూల పల్లెలకు సైతం రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేశారు. అలాగే డ్రైనేజీలు, కల్వర్టుల నిర్మాణాలు జరుగుతున్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆధునీకరించారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్న ఉద్దేశంతో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ డాక్టర్లు ప్రజల ఇళ్ల వద్దకే వైద్యసేవలు అందిస్తున్నారు. మంచానికే పరిమితమై వారికి, నడవలేని వారికి ఇళ్ల వద్దే వైద్యం అందించి, ఉచితంగా మందులు పంపిణీ అందిస్తున్నారు. దీనికి తోడు గ్రామ, పట్టణాల్లో ఇప్పటివరకు ఇళ్లు లేని వారికి సొంతింటి కల నెరవేరుస్తున్నారు. దీంతో జగనన్న కాలనీలు ఏకంగా ఊళ్లకు ఊళ్లే వెలుస్తున్నాయి.





తెరణి గ్రామంలో నిర్మించిన సచివాలయం, బుగ్గఅగ్రహారంలో ఏర్పాటైన సచివాలయం, రైతుభరోసా కేంద్రం, నాగరాజకుప్పం గ్రామానికి వేసిన రోడ్డు

రూ.6 లక్షలతో డ్రైనేజీ కాలువ నిర్మాణం


శరవేగంగా జరుగుతున్న పనులు

వెదురుకుప్పం: మండలంలోని సీఆర్ కండ్రిగ దళితవాడలో రూ.6 లక్షలతో డ్రైనేజీ కాలువ నిర్మాణ పనులను చేపడుతున్నట్లు సర్పంచ్ శిల్ప తెలిపారు. మంగళవారం గ్రామంలో డ్రైనేజీకి సంబంధించి జేసీబీ ద్వారా కాలువ పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా సర్పంచ్ శిల్ప మాట్లాడుతూ ఇటీవల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం జరిగినట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి హాజరవడంతో స్థానికులు డ్రైనేజీ సమస్యను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన మంత్రి ప్రభుత్వం మంజూరు చేసే జీజీఎంపీ నిధులతో మురుగునీటి కాలువ నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దీంతో జీజీఎంపీ నిధులు రూ.6 లక్షలతో 90 మీటర్ల వరకు డ్రైనేజీ నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. అడిగిన వెంటనే సమస్యను పరిష్కరిస్తుండడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో ఏఎంపీ మాజీ ఉపాధ్యక్షుడు రామయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తులు

కార్వేటినగరం: ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)లో ఖాళీలకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ మనోహర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్థానిక ఐటీఐలో కంప్యూటర్ ప్రోగ్రాం అసిస్టెంట్, డ్రెస్ మేకింగ్, ఎలక్ట్రానిక్ మెకానిక్, ఫిట్టర్, డీజిల్ మెకానిక్ కోర్సులకు టెన్త్ విద్యార్హత కలిగిన అభ్యర్థులు 27వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9160012999 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

చెరుకు రైతుల సమస్య పరిష్కరిస్తాం


తహసీల్దార్ అమరేంద్రబాబు

నింద్ర: చెరుకు రైతులకు బకాయిల సమస్య పరిష్కరిస్తామని తహసీల్దార్ అమరేంద్రబాబు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నేతమ్స్ షుగర్ ఫ్యాక్టరీ వారు 2019-20 సంవత్సరంలో రైతుల దగ్గర నుంచి చెరుకు సరఫరా చేసుకుని రూ.36 కోట్లు మేర బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. అయితే బకాయిలు చెల్లించాలని అదేవిధంగా బొంబాయి చెందిన ఫైనాన్స్ కంపెనీకి రూ.63.19 కోట్లు బకాయిలు ఉన్నందున వారు కోర్టుకు సమర్పించారు. రైతుల బకాయిలపై స్పందించిన జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ రికవరీ యాక్ట్ కింద ఫ్యాక్టరీ యాజమాన్యానికి నోటీసులు ఇచ్చామన్నారు. ఈ నెల 24వ తేదీలోపు బకాయిలు చెల్లించాలని, లేకుంటే కలెక్టర్ ఆదేశాల మేరకు ఆస్తి జప్తు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు


నరసింహపురంలో అమ్మవారికి అంబలిని ఊరేగింపుగా తీసుకొస్తున్న మహిళలు

పాలసముద్రం : మండలంలోని నరసింహపురంలో వెలసిన గ్రామ దేవతకు, రాచపాళెంలో వెలసిన బాలగురునాథీశ్వర స్వామికి మంగళవారం పొంగళ్లు పెట్టి అంబలి పోశారు. ఉదయం గ్రామ దేవతను వివిధ అభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం మహిళలు అంబలి, పూజ సామగ్రితో పంబవాయిద్యాలతో గ్రామాల్లో ఊరేగించి అమ్మవారికి అంబలి సమర్పించారు. సాయంత్రం పొంగళ్లు పెట్టి నైవేద్యం పెట్టారు. బాలగురునాథీశ్వరస్వామికి 9 బిందెల పాలు, పెరుగుతో ప్రత్యేక అభిషేకించి దీపారాధన చేశారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ లబ్ధి


మహిళలకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

- ముస్లింమైనారిటీల అభివృద్ధికి ప్రత్యేక కృషి
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి

పెనుమూరు(కార్వేటినగరం) : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రతి ఇంటికీ నాలుగేళ్లలో రూ.1 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు లబ్ధి చేకూరిందని, అందుకే ప్రజలు కూడా జగనన్న పాలనపై అపార విశ్వాసం చూపుతున్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. మంగళవారం మండల కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో కలవకుంట సచివాలయ పరిధిలోని ఎగువపూనేపల్లి, దిగువపూనేపల్లి, రేణుకానగర్, కలవగుంట, కలవగుంట దళితవాడ, పైపల్లె గ్రామాల్లో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణస్వామి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ లబ్ధిని వివరిస్తూ, సమస్యలను అడిగి తెలుసుకుంటూ పరిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తి అయిన ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు నిధులు మంజూరు చేసి గ్రామాల అభివృద్ధికి మరింత కృషి చేస్తున్నారని తెలిపారు.

ముస్లింలకు పెద్దపీట

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ముస్లింల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి అన్నారు. ఎగువ పూనేపల్లికి చెందిన ముస్లిం కుటుంబాల వారు ఆయనకు కండువా కప్పి, ఘనంగా స్వాగతించారు. ఈ సందర్భంగా ఎగువ పూనేపల్లికి చెందిన రజియాభీ మాట్లాడుతూ జగనన్న అందించే సంక్షేమ పథకాల వల్ల ఇంకో 30 ఏళ్లు ఆయనే ముఖ్యమంత్రిగా ఉంటే బాగుంటుందని ఆకాంక్షించారు. అదేవిధంగా ప్రజలను సంతోషంగా చూడాలనుకునే జగనన్న కుటుంబం నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని దీవించారు. అలాగే మదార్ బాషా మాట్లాడుతూ తాను చిన్న పరిశ్రమ పెట్టుకున్నానని, అయితే విద్యుత్ కనెక్షన్ అడగ్గానే ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి స్పందించి వెంటనే విద్యుత్ కనెక్షన్ ఇప్పించి ఆదుకున్నాడని తెలిపాడు. ఆయనకు తమ కుటుంబం ఎప్పుడూ రుణపడి ఉంటుందన్నారు.

అందరికీ కృతజ్ఞతలు

డిప్యూటీ సీఎం నారాయణస్వామి మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రజా ప్రతినిధులకు, అధికారులకు, ప్రజలకు, నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బండి కమాలకర్‌రెడ్డి, నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు యశోదారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు దూది మోహన్, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ మనోహర్, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ అమీన్, నాయకులు దాము, పండరీనాథ్, కృష్ణారెడ్డి, యతీశ్వర్‌నాయుడు, తహసీల్దార్ కళావతి, ఎంపీడీఓ నీలకంఠేశ్వరరెడ్డి, ఎస్‌ఐ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

రాజేంద్ర కుటుంబానికి పరామర్శ..

కలవకుంట దళితవాడకు చెందిన విశ్రాంత సబ్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్ర అనారోగ్యంతో మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఉప ముఖ్యమంత్రి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నుంచి ఆ గ్రామానికి వెళ్లి రాజేంద్ర మృతదేహంపై పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబసభ్యులను ఓదార్చారు.



విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి రోజా

- జగనన్నకు ఘన స్వాగతం పలుకుదాం
- ఆస్పత్రిలో ఏం కావాలన్నా అందించడానికి రోజా చారిటబుల్ ట్రస్ట్ సిద్ధం
- మంత్రి ఆర్‌కే రోజా

పుత్తూరు రూరల్: జనరంజక పాలన ద్వారా దేశ స్థాయిలో రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని పర్యాటక, సాంస్కృతిక, యువజన, క్రీడా శాఖ మంత్రి ఆర్‌కే రోజా తెలిపారు. మంగళవారం వడమాలపేట కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన మండల మీట్‌లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల కోసం అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం జగనన్న ఈనెల 28న నగరికి వస్తున్నారని, కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని ఘనస్వాగతం పలకడం ద్వారా కృతజ్ఞతలు తెలుపుకోవాలని కోరారు. ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పరికరాలు, మందులు అన్నివేళలా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఆస్పత్రులకు ఏదైనా అత్యవసరమైతే తనకు సమాచారం ఇవ్వాలని, తక్షణం తన రోజా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సహకారం అందుతుందని తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా మంజూరైన నిధులతో అభివృద్ధి పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే నాడు-నేడు స్కూల్స్ రెన్యువేషన్ పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ భానుమూర్తి, తహసీల్దార్ సుబ్రమణ్యం, ఎంపీపీ విజయలక్ష్మి, వైస్ ఎంపీపీలు ఉపేంద్ర, లోకేష్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, కోఆప్షన్ మెంబర్లు, అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధికి అడ్డే లేదు..


వడమాలపేట మండల మీట్‌లో మాట్లాడుతున్న మంత్రి రోజా

పుత్తూరు రూరల్: నేటి జగనన్న ప్రభుత్వంలో అభివృద్ధికి అడ్డేలేదని, అవినీతికి తావే లేదని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన, క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. మంగళవారం సాయంత్రం పుత్తూరు పట్టణంలో 14వ ఆర్థిక సంఘ నిధులు రూ.36.15 లక్షలతో నిర్మించిన డ్రైనేజీని మంత్రి ప్రారంభించారు. జనరల్ ఫండ్స్ రూ.13.10 లక్షలతో డ్రైనేజీ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి ప్రభుత్వంలో ప్రతి గ్రామం, పట్టణంలో అభివృద్ధి పనులు జరిగాయని తెలిపారు. గత ప్రభుత్వం మాటలకే పరిమితం కాగా నేటి ప్రభుత్వం చేతలతో సమాధానం చెబుతోందన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండింటిని సమపాళ్లలో ప్రజలకు అందించిన ఘనత నేటి సీఎంకే దక్కుతుందన్నారు. మీకు మంచి జరిగి ఉంటేనే మాకు ఓటు వేయండని అడిగే దమ్మున్న ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమని అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా ప్రతి ఇంటి వద్దకు వెళ్లి, ప్రజల అవసరాలను అడిగి తెలుసుకుని సాయం అందిస్తున్న దేశంలోనే ఏకైక ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమన్నారు. అభివృద్ధి, సంక్షేమం ఇలానే కొనసాగాలంటే మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేయాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి, మున్సిపల్ కమిషనర్ కెఎల్ఎన్ రెడ్డి, చైర్మన్ హరి, వైస్ చైర్మన్లు శంకర్, జయప్రకాష్, కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అభిమానికి ఆత్మీయ పలకరింపు


అభిమాని వెంకట్రామిరెడ్డిని ఆప్యాయంగా పలకరిస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

నగరి : మెదక్ జిల్లా సంగయ్యపేటకు చెందిన వెంకట్రామిరెడ్డి, మంజుల దంపతుల కుమారుడు ధీరజ్ రెడ్డి పుట్టుకతో అంధుడైనా మంత్రి ఆర్కేరోజాకు వీరాభిమాని. ఆమె రాజకీయంగా వ్యవహరించే తీరు అతనికి ఎంతో ఇష్టం. ఆమెను ఎలాగైనా నేరుగా కలవాలన్నది అతని కోరిక. పట్టుబట్టి నగరిలోని ఆమె స్వగృహానికి మంగళవారం కుటుంబసభ్యులతో పాటు విచ్చేశాడు. విషయం తెలుసుకున్న మంత్రి తన అభిమానిని ఆప్యాయతతో పలకరించారు. మంత్రి ఆర్కేరోజాను కలవాలన్న అతని పట్టుదలకు అందరూ ఆశ్చర్యపోగా మంత్రి పలకరించి ఫొటో దిగడంతో ఆ అభిమాని ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. తాను అభిమానించే వ్యక్తిని తన కళ్లతో చూడలేకపోయినా పలకరించిన సంతోషం చాలంటూ ధీరజ్‌రెడ్డి తెలిపారు.

ఆరిమాను గంగమ్మకు పొంగళ్లు


అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

శ్రీరంగరాజపురం : మండలంలోని పాదలపల్లి గ్రామస్తులు స్థానిక సర్పంచ్ విజయ ఆధ్వర్యంలో ఆరిమాని గంగమ్మకు మొక్కులు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో తమ ఊరిలో హిందూ ఆలయం లేదన్నారు. నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో డిప్యూటీ సీఎం నారాయణస్వామి చొరవతో పాదలపల్లి గ్రామంతో పాటు వెంకటాపురం పంచాయతీలో 4 ఆలయాలను మంజూరు చేశారన్నారు. మంగళవారం గ్రామస్తులంతా కలసి అమ్మవారికి పొంగళ్లు, నైవేద్యం, ముడుపులు సమర్పించారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు గతంలో హిందూ ఆలయాలను ధ్వంసం చేస్తే, నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పునర్ నిర్మిస్తున్నారని తెలిపారు. గుడి లేని తమ గ్రామానికి ఆలయం మంజూరు చేసిన సీఎం జగనన్నకు జీవితం తం గ్రామస్తులంతా రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఏకంబరం, కలాప్ప, మహేష్, గోవిందయ్య తదితరులు పాల్గొన్నారు.

పనితీరు మెరుగు పరుచుకోండి

పాలసముద్రం : మండల మహిళా సమాఖ్య పరిధిలో వీఓలు ఆర్థికంగా పటిష్టం కావాలని ఐకేపీ ఏపీఎం ఫరీద్ మస్తాన్ తెలిపారు. మంగళవారం ఐకేపీ కార్యాలయంలో వీఓ లీడర్లు, సంఘమిత్రలతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామ సమాఖ్య ఆర్థికంగా పటిష్టం కావాలని, వీఓల సంవత్సర ఆదాయం చూస్తే రూ.10 వేలు కన్నా తక్కువ ఉందని, వీరంతా పనితీరు మెరుగు చేసుకోవాలని తెలిపారు. గ్రూపులోని ప్రతి వీఓ కూడా మండల సమాఖ్య ఏ గ్రేడ్‌లో ఉండేటట్లు పనిచేయాలని తెలిపారు. రికవరీ 100 శాతం ఉండాలన్నారు. పుస్తక నిర్వహణ ఎప్పటికప్పుడు పూర్తి చేస్తూ సంస్థను పటిష్ట పరిచే విధంగా పని చేయాలని సూచించారు. స్త్రీనిధి, ఉన్నతి సక్రమంగా కంతుల ప్రకారం రుణాలను కట్టించాలన్నారు. సీసీ చిరంజీవి, వీఓ లీడర్లు, సంఘమిత్ర మురగయ్య పాల్గొన్నారు.

అశ్వ వాహనంపై ద్రౌపదీదేవి చిద్విలాసం


అశ్వవాహనంపై విహరిస్తున్న ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి

పుత్తూరు రూరల్: ద్రౌపదీదేవి సమేత ధర్మరాజుల స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం అమ్మవారి కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. అనంతరం స్వామి, అమ్మవార్లను పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి అశ్వ వాహనంపై అధిష్టింపజేశారు. బెస్తసంఘం వారి ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లు తిరువీధుల్లో విహరించారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న మంత్రి ఆర్‌కే రోజా సెల్వమణి దంపతులను ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు.

కరుమారియమ్మకు పూజలు



నింద్ర: మండల కేంద్రం నింద్రలో ఓంశక్తి ఆలయంలో కరుమారియమ్మ దేవతకు మంగళవారం ఉదయం భక్తులు ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రతి ఇంటి నుంచి పొంగళ్లు తీసుకొచ్చి నైవేద్యంగా సమర్పించి కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.